# జహంగీరు

ఎం. ఎన్. మూర్తి

'శేషయ్యా ?'

"ప్రభూ ! ఏమిటలా–?"

"నా ఆశలన్నీ భగ్నమైనాయోయ్–"

"చిత్తం ! ఏం జరిగిందేమిటండి ?"

"మన జహంగీర్ విషయం–"

"........?"

"అదేనోయ్–మనం కొత్తగా కొన్న పంచకల్యాణి–"

"చిత్తం చిత్తం! భలేపేరు పెట్టారండి—ఇంతకీ ఏం జరిగిందేమిటి ?"

"దీపావళినాడు తొలిసారి ఎక్కుదామని ముచ్చటపడ్డాను–"

"చిత్తం–ఇప్పుడేమండీ ? ఎక్కొచ్చును–ఈవేళేగా దీపావళి ?"

"శేషయ్యా ? ఎలా ఎక్కమంటావోయ్ ? నా బాధలు నీకు అర్థమవుతాయా ?"

"ప్రభూ ! శాంతివహించండి. ఏం జరిగిందో చెబితే... ?"

"జహంగీరు పరిస్థితి ఏమీ బాగా లేదోయ్–"

"జబ్బాండి ?"

"కాదు–"

"ఎక్కబోతే తంతున్నాడాండి?"

"ఊహూ–"

"కరవొస్తున్నాడా ?"

"ఊహూ–"

"మరేమిటండీ ?"

"దీనంగా చూస్తూ, కళ్ళవెంబడి అశ్రుధారలు కారుస్తూ ఇష్టం లేనట్టుగా, విరక్తిగా నిలబడి వుంటున్నాడు–"

"కాస్త హెచ్చరించి, బుజ్జగించలేక పోయారా?"

"నా శాయశక్తులా ప్రయత్నించాను, అశ్విక పరీక్షకుడు కూడా వచ్చి చూచి పెదవి విరిచాడు–శేషయ్యా" జహంగీరు ఏదో మనోవేదనతో బాధపడుతున్నట్టున్నాడు–"

"విచారించవలసిన విషయమేనండి– ఐనా ప్రభూ ! కొంచెం ధైర్యం వహించండి–గుర్రాలకు ఇలాం టితిక్క—"

"తిక్కకాదు–మనోవ్యాధి అను–"

"చిత్తం , మనోవ్యాధే అనండి–అది ఎలా వొచ్చిందో అలాగే పోతుందండి–'

"ఇంతకీ ఈ దీపావళి ఘడియలలో నేను నా జహంగీరుపైన స్వారిచేసే అదృష్టం–"

"ప్రభూ! అధైర్యపడకండి–ఇంతకూ ఒక్క మనవి–జహంగీరు తన శాలలో ఒక్కడే వుంటున్నాడా?"

"అవును–ఒక్కడే"

"ప్రభూ !"

"శేషయ్యా !

"గొప్ప పొరబాటు చేశారు–"

"ఏమిటది–ఏమిటోయ్ శేషయ్యా ?"

"శుద్ధచవట షెద్దమ్మ పనిచేశారు–"

"నా మొహం ! వెర్రివెధవని ! ఏం చేశాన్ చెప్పు–"

"ప్రభూ పశ్చాత్తాపానికి వ్యవధిలేదు"

"మరి ఏం చెయ్యమంటావ్ ?"


"ఈ దీపావళి ఘడియలు దాటిపోకుండా మా కోరిక సిద్ధించాల్నంటే–"

"ఈవేళ సాయంత్రానికేనా నేను నా జహంగీరు నెక్కి షికారు చెయ్యాల్నంటే–"

"ఒఖటే మార్గం–"

"ఏమిటదీ–త్వరగా ?"

"తమరు వెంటనే ఒక సూర్జహానును వెతికితెచ్చి జహంగీరుకు కానుక పెట్టాలి–"



# జానకమ్మ - జామిచెట్టు

ముదిగొండ శివప్రసాద్

'ఓరేయ్! మీ కేం పొయ్యే కాలం వచ్చిందిరా రాళ్లు విసురుతారు' అని రెండు మూడు పరుషవాక్యాలూ, అమంగళాలూకూడా జోడించిన అరుపులు సర్వకాల సర్వావస్థలలోనూ వినబడే ఇల్లే జానకమ్మగారిది. పోరగాళ్లు చెట్టుకు కాయలువున్నా లేకున్నా రాళ్లువేయడం మటుకు అన్ని కాలాలలోనూ మానరు. ఓపిక ఉన్నా లేకున్నా ఊపిరి కూడ దీసుకొని జానకమ్మ రోడ్డుమీదపోతూ మనుషుల్ని అవాచ్యాలాడటం అన్ని ఋతువులలోనూ మానదు. కొంతకాలమయ్యేసరికి జానకమ్మకు ఈ తిట్లు దైనందిన కార్యక్రమంకింద, ఒక వదల లేని వ్యసనంకింద, ఒక క్రానిక్ డిసీజ్ కిందికి మారింది. అందువల్లనే చెట్టుపై ఎవరూ వేయకపోయినాసరే ముందు జాగ్రత్తగా అన్నట్లు 'ఓరేయ్ మీకేం పోయేకాలం– అని జానకమ్మ తిడుతూనే వుండే దశ ఒకటి ప్రాప్తించింది.

జానకమ్మ భర్త పరిగి గోవింద స్వామి జీవించివున్న రోజుల్లో మంచి ధనవంతుడనే నలుగురూ అంటారు కాని

లోకులు పలుకాకులు అంటుంది జానకమ్మ. నామొగుడు నాకు వదిలిపెట్టి వెళ్లిందల్లా ఈ జామిచెట్టుతోవున్న ఇల్లు మాత్రమే. ఈ చెట్టు ఆయన స్థిరాస్థి, నేనేమో చరాస్థిని' అనేది జానకమ్మ. ఆయిన పోటోయేముందు 'మరి నామాటేమిటి చెప్పారు' అని జానకమ్మ అడిగితే చెట్టువైపు దీనంగా ఓ చూపు చూచి మరీ పోయాడట గోవిందస్వామి— భర్త చూపులను వాక్యాల లోపలికి అనువదించి భాష్యంకూడా చెప్పుకొని యథాతథంగా అనుసరిస్తూ అక్షరాలా చెట్టుపైనే జీవించడం మొదలుపెట్టింది జానకమ్మ. జామిచెట్టు ఆగస్టునుంచి అక్టోబరు వరకు మంచికాపు కాస్తుంది. అందువల్లనే జులై మాసం వచ్చిందంటే జానకమ్మకు ఇక నిద్రపట్టదు. తెల్లవార్లూ నిశాచరిలా చెట్టుకు కాపలాకాస్తూ తిరుగుతున్న ఆమెనుచూచి ఒకరిద్దరు దడుసుకోవడం కూడా జరిగినట్లు చెపుతారు.

జానకమ్మది ఆరడుగుల భారీ విగ్రహం. ఓ మోస్తరు కోరపళ్ళు. ఈశ్వరుడు చీకటి అనే సమ్మెటపై, కజ్జలమనే మూసలో రంగరించిన శ్రావణమేఘాన్ని సానబెట్టాడా అన్నట్లు ఉండేరూపం. గోవిందస్వామి బతికివున్న రోజుల్లో జానకమ్మ జామిచెట్టుకింద నిలబడివుంటే 'ఓహో జామిచెట్టు కిందికి కానుగచెట్టు చేరిందేమిటి' అనేవాడు ఛలోక్తిగా— కానుగను కావ్యభాషలో తమాలమని వర్ణిస్తారు. దీనినుండి చీకటి పుడుతుందని కవిసమయం. అయితే జానకమ్మను శ్యామగా, నీలాంబరిగా, కౌమారిగా తమాలవనలక్ష్మిగా భావించేందుకు లోకులంతా గోవిందస్వాములుకారు. అందులోనూ పోరగాళ్ళకు ఆమె తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టేసరికి తిక్క తిరిగేది.

'జానికమ్మా ఓ జామకాయ ఇవ్వవూ' అంటూ వాకిట్లో ఓ గుంటడు అరిచేవాడు—

'నీకేంపొయ్యేకాలం వచ్చిందిరా ముండాకొడకా' అని జానకమ్మ తిట్లుకు లంకించుకోగానే 'అందుకే నీ మొగుడు బెజవాడలో తపీమనిచచ్చాడు పీనాసి కొరివిదయ్యమా' అని ఆ గుంటడు జానకమ్మను గుంటలోపెట్టి గంటవాయించి మరీ పోయేవాడు. అంతటి తమాలవనలక్ష్మి వాళ్ళపాలిటికి కొరివిదయ్యంలా మారిపోయేది। మనుషులే కాదు పశుపక్ష్యాదులన్నా జానకమ్మకు కోపమే। వసంతం వచ్చిందన్నా హేమంతం పిలిచిందన్నా శరత్తు విరిసిందన్నా జనానికంతా సంతోషమేకాని జానకమ్మ మాత్రమే దుఃఖమయ జీవిగా మారిపోయేది. అశోకవనంలో సీతలాగా జామిచెట్టుకింద కూర్చొని ఇరవైనాలుగు గంటలూ గోడుగోడున ఏడ్చేది. మొగుణ్ణి తలచుకొని తలచుకొని ఏడ్చేది. కారణం







భర్తపై ప్రేమకాదు—ఆయనుంటే ఈ పిట్టల్ని తోలేపని తానే స్వయంగా చూసుకునేవాడు కదా' అని. నిజానికి వెలగటూరు గ్రామంలోని పిట్టలన్నీ సపరివారబంధుమిత్రంగా జానకమ్మగారి జామిచెట్టుపైకి విందుభోజనాలకై వేంచేసేవి. ఇటు లక్సెట్టిపేట నుంచీ అటు ధర్మపురినుంచీకూడా అతిథులను పిలుచుకొని మరీ వచ్చేవి. ఈ దృశ్యం చూసేసరికి జానకమ్మగుండె బద్దలైనట్లయ్యేది. లబోదిబోమని నెత్తీనోరూ బాదుకుంటూ రాత్రింబవళ్ళు రాళ్ళతో పిట్టల్ని తోలుతుంటూ కాలక్షేపం చేస్తూండేది. ఈ రాయితగిలి ఏ రామచిలకైనా బాధతో తీతువులా అరుస్తుంటే అప్పుడుమాత్రం జానకమ్మ గర్వంగా ఒక్క నిట్టూర్పు విడిచేది. అలాంటి జానకమ్మగారింటికి అసిఫాబాదునుండి వచ్చాడు ముదుంబై లక్ష్మణాచార్యులు.

లక్ష్మన్నను ఆదరంగా ఆహ్వానించింది జానకమ్మ. యోగక్షేమాలు అడిగింది. జామిచెట్టుకింద ఓ పీటవేసి కూర్చో

బెట్టింది. 'రాకరాక వచ్చావు బిడ్డా. ఇక నాగుర్చి చూచేదెవరు నువ్వు గాక' అంది. "నినిని..నిజమే అందుకే వచ్చాను అన్నాడు లక్ష్మన్న. అయితే లక్ష్మణాచారి తాను విన్నదానికీ కన్నదానికీ బొత్తిగా పొత్తు కుదరక కొంత మథన పడ్డాడు. జానకమ్మకు కడుపున పుట్టిన పిల్లలు లేరు. 'పిల్లలు లేకుంటే పీడా బోయిరి — తినడానికేగాని పిల్లలవల్ల లాభం ఏమిటి?' అని వాణిజ్యశాస్త్రంలో సమాధానం చెప్పుకొంది జానకమ్మ తొలిరోజుల్లో. గోవిందస్వామిమాత్రం 'పిల్లలంటే కడుపున పుట్టినవారే వుండాలా ఏమిటి? బ్రహ్మజ్ఞానం కలిగితే చాలు— ఈ వెలగటూరులోని పిల్లలంతా మన పిల్లలే' నని ఆధ్యాత్మికంగా సమాధానం చెప్పుకున్నాడు. అప్పటికీ ధర్మపురి నరసింహస్వామికి పూజలుచేయించాడు. గోదావరిలో స్నానాలు చేయించాడు. కొండుభట్లవారిచే వ్రతాలు చేయించాడు. యాదగిరిగుట్టస్వామివారికి భోగాలు చేయించాడు. అయినాసరే, జానికమ్మ సంకల్పబలమే గెలిచింది. ఆమె వీర వంధ్యగానే మిగిలిపోయింది. అయితే గోవిందస్వామి పోయిన తర్వాతగాని జానకమ్మకు పిల్లలవిలువ తెలిసిరాలేదు. 'తినేవాళ్లేకాదు చేసేవాళ్ళుకూడా పిల్లలే నన్న సత్యం ఆమెకు తెలిసేసరికి ఆ అవకాశం చేజారిపోయిన వయస్సులో పడిపోయింది. తొలిదశలో లోకులు తన్ను గొడ్డుమోతుదానా అని తిడితే ఆ తిట్టును దీవెనగా భావించేది. కాని ఇటీవల వాళ్లెవళ్లో తనకు, సంతానం కని సమాజానికి అన్యాయం చేయనందుకు 'వెలగటూరు వీరవనిత' అని బిరుదిచ్చి సన్మానం కూడాచేస్తే అందుకు విచారపడింది జానకమ్మ. ఈదశలో ఆమెకు అక్కరకువస్తాడనిపించింది లక్ష్మణాచారి. లక్ష్మన్న దూరపుబంధువు. అనాధ. కేవలం రెక్కల కష్టంమీద ఆధారపడి జీవిస్తున్నాడు. ఇతన్ని పెంచుకుంటే దిక్కుగా వుంటాడని భావించింది జానకమ్మ. అందుకే ఒకరోజున అన్నది. "నీవే బిడ్డవు. కడుపున పుట్టాలా ఏమిటి? ప్రేమవున్న వాళ్ళంతా తల్లులే"

"ని...ని ... నిజమే" నన్నాడు లక్ష్మన్న."

అంతే - డబ్బుఖర్చయ్యే మరేదత్త స్వీకారోత్సవమూ లేకుండా వారిరువురూ తల్లీ బిడ్డలై పోయారు.

అయితే లక్ష్మన్న ఎన్నడూ జానకమ్మ దగ్గరికి వచ్చింది లేదు. జానకమ్మ రమ్మని పిలిచిందీ లేదు. కాని ఇటీవల అసిఫాబాదులో ఎవరో జానకమ్మ ధనమంతా లక్ష్మన్న కివ్వబోతున్నదనీ, జానకమ్మబాగా పెద్దదై తొడిమవూడిన పండులా వున్నదనీ, అనుకుంటూండగా విని స్వయంగా కనుక్కొని పోదామని వచ్చాడు—రాగానే జామిచెట్టుకింద



కూర్చోబెట్టి యోగక్షేమాలు అడిగింది. అదీ సంగతి.

తొలిచూపులోనే లక్ష్మన్నకు జానకమ్మ నిరుపేద అన్న విషయం నిర్ధారణ అయిపోయింది. దానికి తగ్గట్టు జామపుల్లలతో నీళ్ళుకాయడం మొదలు పెట్టింది. లక్ష్మన్న విడ్డూరంగా చూచాడీదృశ్యాన్ని. 'ఆకలిగా వుందేమో బిడ్డా, నిమిషాలమీద వంటచేస్తాను. ఈ లోపున ఓ పండో ఫలమో తిందువుగాని రా' అని చెట్టుకింది జామిపండ్లు ఏరి ఓ జామాకులోపెట్టి లక్ష్మన్న ముందుంచింది. ఎంత గతిలేకున్నా అసిఫాబాదులో ఇరానీ హోటల్లో సమోసా, చాయ్‌లతో లక్ష్మన్న నాస్తాచేసి మరీ పనిలో ప్రవేశించేవాడు. అలాంటిది ఈ ఫలహారం లక్ష్మన్నకు బొత్తిగా సహించలేదు.

'ఛ—ఛ-ఛాయ్'.. చాయ్ కావాలన్న కోరికను వ్యక్తం చేశాడు లక్ష్మన్న.

'ఉళ్ళో మంచి పాలే దొరకడంలేదు. పాలల్లో నీళ్ళున్నయ్యంటే గేదె కుడితి ఎక్కువతాగుతున్నదని జవాబు చెపుతున్నారు—అందుకని పాలు కొనడమే మానేసాను బిడ్డా' అని జానకమ్మ పాలవాళ్ళ అవినీతిపై తాను చేసిన సహాయ నిరాకరణాన్ని విని సమర్థించలేక పోయాడు లక్ష్మన్న. 'వంటికి మంచిది కళ్లకు చలువ—తరవాణికుండ పెట్టినాను తాగుతావా'

'కాలే కడుపుకు మండే గంజి' అనుకుంటున్న లక్ష్మన్న 'పొ—పో—పోయ్య' అన్నాడు—పోసింది జానకమ్మ. వద్దన్న కొద్దీ మరోగ్లాసు ఎక్కువ ఇచ్చింది. బలవంతంచేసి 'అన్నంకోటా త—త—తగ్గించేందుకల్లే వుంది ఈ ఎత్తు' అని ఆమె అనురాగాన్ని కూడా అనుమానాస్పదంగానే చూచాడు లక్ష్మన్న, ఈ లోగా ఇద్దరు పోరగాళ్ళు జానకమ్మ ఇవిగో నూకలు—' అని గుప్పెళ్ళతో నాలుగు కుప్పల నూకలు బండమీద పోశారు— నాలుగింటికీ నాలుగు జామకాయ లిచ్చి బార్టర్ సిస్టంలో బేరం ఫైసల్ చేసింది 'ఈ కాయ చిలుక కొట్టేసినాది—' ఓ పోరగాడు ఆక్షేపించాడొక కాయను—

'నీ నూకల్లో కూడా మట్టి కలసి వుందిరా—' జానకమ్మ జవాబు చెప్పింది తకీసని—

'నేనేం మట్టివి కలిపినానా? గిట్లాగే దొరికినై — తీసొక్కొచ్చినాను' పోరగాడి సంజాయిషీ.

'నేనేం చిలకనా—ఇట్లాగే కొట్టేసింది కిందపడింది పీకిచ్చినాను— పోరాపో' జానకమ్మ పోరగాళ్ళను వదిలించుకొని 'బిడ్డా నీళ్లు మసులు తున్నట్లున్నయి— స్నానం చేసి అరుగుమీద కూర్చో—క్షణంలో వంట చేసి వడ్డిస్తా నన్నది జానకమ్మ ప్రేమతో... గుడ్లప్పగించుకొని ఈ నూకల బేరాన్ని చూచిన లక్ష్మన్న అనుకున్నాడు మనస్సులో "జామాకు

విస్తారిలోనా లేక ఛీఛీ చిల్లి ముంతలోనా ఎందులో వడ్డిస్తావ్ ఈనూకల జావను–" కాగీకాగని నీళ్లలో వళ్లు తడుపుకొని పంగనామంసింగారించుకొనివరిశుభ్రంగా, కడిగిన ముత్యంలా అరుగుపైన ఎండ పొడకు కూర్చున్నాడు లక్ష్మణాచారి. జామకొమ్మలతోనే వంటచేస్తూ జానకమ్మ మొగుడు పోయిన దగ్గరినుంచి వచ్చిన కష్టాలన్నిటినీ దీర్ఘాలుతీస్తూ ఏకరువు పెడుతూవుంది. నిర్లిప్తంగా కూర్చున్నాడు లక్ష్మన్న. ఆమె ప్రసంగ సారాంశమంతా నాలుగైదు వాక్యాల్లో సంక్షిప్తీకరించవచ్చు. ఈ వూళ్లో అందరిదృష్టీ తన జామచెట్టుపైనే. నీ ఒక్క క్షణం ఏమారితే చాలు కాయలన్నీ దోచుకోవాలని చూస్తున్నారనీ, ఎక్కడలేనివాళ్ళంతా తన చెట్టుకోసం మిత్రుల్లాగా బంధువుల్లాగా నటిస్తున్నారనీ దాని భావం. 'ఛాఛా కొంపదీసి నన్నుకూడా తన జామకాయల కోసమే వచ్చాననుకున్నదేమిటి రామానుజా' అని ఉలిక్కిపడ్డాడు లక్ష్మన్న– భావి కార్యక్రమం క్షణాల మీదే నిర్ణయించుకున్నాడు.

'చూడు బిడ్డా ఈ యిల్లూ నా వళ్లూ రెండూ పెద్దవైపోయాయి – ఈ ముసలితనంలో నాకు మందు లెందుకూ యింటికి హంగు లెందుకూ చెప్పు–' ఉల్లిపాయను బంధపచ్చడిగా నూరుతూ ప్రశ్నలోనే సమాధానాన్ని [illegible]ంచేసి అన్నది జానకమ్మ. 'ఔనౌను' గంగిరెద్దులా తల మాత్రం ఊగించాడు లక్ష్మన్న. 'గుప్పెడు నూకలుంటే సరిపోయె – ఓ జామకాయ పచ్చడీ, మరోపండు ఫలహారమూ – ఇంక డబ్బుతో పనేమిటి – ఈ బతుకు వెళ్లదా ఏమిటి?'

'ఓ హో హో–– ఈవిడ కామ కాంచన విజయం సాధించింది' అనుకున్నాడు లక్ష్మన్న.

'జానికమ్మా ఓ జామకాయివ్వవూ' బైట ఓ పోరగాడి కేక.

'నీ జిమ్మడా– మీ కాయిలకు వేళాపాళా లేదట్రా – పొండి పోండి.'

పై జానకమ్మ మాటలకు ప్రతిసమాధానంగా ఆ గుంటడు ఓ రాయిని చెట్టు పైకి విసిరాడు. అది టపీమని లక్ష్మన్న నడినెత్తిపై పడి ఓ భూకంపాన్ని సృష్టించింది. 'రామానుజా మూ మూ మూలిగే నక్కమీద తాటిపండు' అని నెత్తి రుద్దుకున్నాడు లక్ష్మన్న. అక్కడ ఘనంగానే బొప్పికట్టింది.

'మరైతే నేను సాయంత్రం హహ అసిఫాబాదు బయలుదేరుతున్నా' నన్నాడు లక్ష్మన్న.


'చూడు బిడ్డా చేయికి చేయికి తోడు మనిషికి మనిషి నీడ...'

('నీకు మాత్రంజామిచెట్టే నీడ' అని లక్ష్మన్న స్వగతం)

'కాబట్టి నువ్వు ఇక్కడే వుండొచ్చు. ఎక్కడైనా రెక్కలకష్టమే కదా – ఆ చాకిరీ ఏదో ఇక్కడే చేసుకుంటేసరి,








'ఈయన్ని హిమాలయాల్నించి రప్పించాను. ఇన్‌కంటాక్సువాళ్ళు ఎప్పుడొచ్చేది మనకు ముందుగానే చెప్పగలడు !!'

నే నేదో వుడకేసి పడేస్తాను. తింటూ కాలక్షేపంచేయవచ్చు' నన్నది జానకమ్మ.

సమాధానంగా ఇదీ అదీ అని చెప్పలేని ఓ నవ్వు నవ్వాడు లక్ష్మన్న. జానకమ్మ జామాకులతో ఓ విస్తరి కుట్టింది. గిజిగాడు గూడుకట్టడంలో చూపినంత కళాకౌశలం ప్రదర్శించింది జానకమ్మ ఈ చిన్న చిన్న జామాకులను కలిపికట్టి కుట్టడంలో – 'పొదుపు ఉద్యమ మాతామహి' అన్న బిరుదం ఇవ్వవచ్చును జానకమ్మకు – అనుకున్నాడు లక్ష్మన్న మనస్సులో. గ్లాసులో తాగాలో విస్తరిలో తినాలో తెలియక తికమకపడదగ్గ ఓ నూకల రసాయనాన్ని జానకమ్మ వడ్డించగా బంధపచ్చడితో నంజుకుంటూ అరగించాడు లక్ష్మన్న. భోంచేసి కొంచెం సేపు విశ్రమించి వెంగటూరులో ఒక్కరౌండు తిరిగివద్దామని బయలుదేరాడు. వెలగటూరు పక్కనే ఓ చిన్న కాలువ ప్రవహిస్తూ వుంటుంది అవంటే లక్ష్మన్నకెంతో ప్రాణం. చిత్ర విచిత్రమైన చెట్ల మధ్యగుండా జలపక్షుల కలరవాలగుండా పయనిస్తూ ఎక్కడికో పోతూ వుంటుంది ఆ కాలువ. కాలువ ఒడ్డునే స్వచ్ఛమైన బండలు. వెళ్లి లక్ష్మన్న ఓ బండమీద కూర్చొని ప్రకృతి దృశ్యాలను తిలకిస్తున్నాడు. ఇంతలోనే

అక్కడికి వచ్చాడు యాదగిరి కొడుకు ధర్మన్న గేదెలు తోలుకుంటూ.

'ఏం ధర్మన్నా ఖు, ఖు- కులాసాగా వున్నావా ?' పలకరించాడు లక్ష్మన్న.

'ఓహో లచ్చన్నగారా ? అసిఫాబాదు నుంచి ఎప్పుడొచ్చినారేంటి మీరు?' గేదెలను నీళ్లల్లోకి వదిలి ధర్మన్న లచ్చన్నను సమీపించాడు. తాను జానకమ్మను చూచిపోవడంకోసం వచ్చినట్లు చెప్పాడు లచ్చన్న. జానకమ్మ పేరు వినగానే ధర్మన్న ఎందుకో భయపడ్డాడు. తేలికగానే ఆ కళ్లల్లోని భయాన్ని పోల్చుకున్నాడు లచ్చన్న.

'ఏం ధర్మన్నా? విశేషాలు చెప్పు మీ వూరువి'-

ధర్మన్న ఏమీ మాట్లాడలేదు. దిక్కులు చూస్తున్నాడు. మాటలకోసం వెతుకుతుంటూ. లచ్చన్న పదే పదే అడగగా చివరకు గత్యంతరంలేక చెపుతున్నట్లుగా ముఖంపెట్టి అన్నాడు ధర్మన్న 'లచ్చన్న బాబూ- అసలువిషయం చెపుతాను- నా ఉద్దేశంలో జానకమ్మ ఎప్పుడో చచ్చిపోయింది. ఇప్పుడాయింట్లో వుంటున్నది కేవలం ఆమెదెయ్యం మాత్రమే' _

లచ్చన్న గుండెలు గుభేలుమన్నాయి.

భూమి అటూ ఇటూ ఒకసారి తిరిగినట్లనిపించింది. అంతలావు లక్ష్మన్న కొయ్యలా మారిపోయి మిడిగుడ్లతో వింటున్నాడు ధర్మన్న మాటలు. ధర్మన్న క్రమంగా చెప్పుకుపోతున్నాడు. దాని సారాంశం ఏమిటంటే, ధర్మన్న ఒకరోజు రాత్రి గేదె కాలువదాటి తప్పిపోతే వెతికి తీసుకొస్తున్నాడట. ముందు గేదే వెనుక తానూ. అలా జానకమ్మగారింటి మీది గుండా వెళ్తుంటే జడలు విరబోసుకున్న దయ్యం ఒకటి భూమిలోంచి జామిచెట్టు పైకి ఎగురుతూ వస్తున్నట్లు కన్పించిందట - ఉలిక్కిపడి చూచాడట ధర్మన్న. 'ఎవడ్రా వాడు' గాండ్రించిన శబ్దం, ధ్వనికూడా జానకమ్మదే. పోల్చుకున్నాడు ధర్మన్న. సందేహం లేదు !! అంతే ! ఒకటే పరుగులంకించుకున్నాడట ఇంటివరకు - ఆ రాత్రి పడటం పడటం ఓ వారంరోజులవరకూ మంచంమీదినుంచి లేవలేదట ధర్మన్న -

'ఈ మాటలు మా అయ్యతో చెపితే నన్ను గేలిచేసిండు. కాని నిజంగా దయ్యాన్ని కళ్లతో చూచినాను బాబూ' ఒట్టుపెట్టుకొని చెప్పాడు ధర్మన్న. ఆనాటి రాత్రి ధర్మన్న వచ్చిన దశలోకి రావడం ఇప్పుడిక లచ్చన్నకు మిగిలి వుంది - ధర్మన్న ఇంకా చాలావిషయాలు చెప్పాడు. గోవిందయ్యగారు ఉన్న రోజులనుంచే జానకమ్మగారు పీనాసిగా బతికేదట. ఆయన దగ్గర పాలకనీ, పప్పులకనీ డబ్బులు తీసుకొని, కొన్నట్లు లెక్కచూపించి, డబ్బులుమిగిల్చి వడ్డీలకిచ్చేదట. జామకాయలమ్మీ, పుల్లలమ్మీ పైసలు సంపాదించేదట - ధర్మపురి నృసింహోత్సవాలలో ఖురఖాతో





ఆడుకొంటున్న స్త్రీ కూడా జానకమ్మ అనే ధర్మన్న భావం. అది నిరూపించడానికేవో కొన్ని ఉపపత్తులు చెప్పాడు కూడాను - 'ఈమె కెవరో భానుమతి చేసింద్రు - అందుకే పాగల్ ఆయిపోయి చచ్చిందని నా నమ్మకం-'

భానుమతి లేక బాణావతి అనబడే ఆ చేతబడిని జానకమ్మమీద చేయవలసినంత అవసరం ఎవరికుందో వెలగటూరులో లచ్చన్నకైతే అర్థంకాలేదు -

'అప్పుడు ఒకల్లిద్దరికి నే నీ దయ్యం సంగతి చెప్పినాను. కాని ఎవ్వరూ నమ్మడంలే' దన్నాడు ధర్మన్న.

'నిజమే ! తాను మాత్రం ఎలా నమ్మగలడు ??

ఆమెచేత స్వయంగా జామాకుల విస్తరిలో భోంచేసినవాడు.

'వస్తాను బాబూ' దర్మయ్య లేచాడు.

అంతటి ప్రశాంత ప్రకృతీ లచ్చన్నకు భయంకరంగా కన్పించింది. తిరిగి ఇంటికి పోవడమా లేక ఇటుగుండానే అసిఫాబాదు దోవ పట్టడమా అని ఒక్కక్షణం ఆలోచించాడు. కాని తన చేతిసంచీ అక్కడే వుండిపోయింది. సరే ! ఏమైతే అది అయిందని గుండెధైర్యం కూడదీసుకొని మెల్లగా బయలుదేరాడు. ఇల్లు చూస్తుండగానే వచ్చిందికాని, లోనికి పోవడానికి కాళ్లాడలేదు బిక్కుబిక్కుమంటూ లోనికి ప్రవేశించేసరికి ఏవో మాటలు వినపడుతున్నాయి 'తవునుమరి ఎప్పుడు సంపదకలిగితే అప్పుడే కప్పలు చేరుతాయి - వరహాల జామిచెట్టు - ఎవళ్లైనా వస్తారు ఇవ్వాళ..."

తన్నుగూర్చేనా ఈ మాటలంటున్నది జానకమ్మ ?? లోనికి మరో రెండడుగులు వేసి చూచాడు-

జానకమ్మ ఒక్కతే కూర్చొని కింద రాలిన జామపండ్లను ఏంచుకుంటున్నది- చుట్టూ చూచాడు. ఎవరూలేరు - ఎవరితో మాట్లాడుతున్నట్లు ఈమె ? తనలో తానేనా ?? లేక కంటికి కన్పడని మరేదైనా వస్తువుతోనా ???

'మను మరింక నేనెళ్లొస్తాను' సంచీ చేతబుచ్చుకొని లోపల ఒకకాలూ బయట ఒకకాలూ పెట్టి అన్నాడు లచ్చన్న, పరుగుపందానికి సిద్ధంగా వున్నట్లు -

'మంచిది కబురు పెట్టినప్పుడు కొంచెం రా నాయనా' గట్టిగా ఉండమని కూడా అనలేదు -

అంతే ! వీధినిపడ్డాడు లచ్చన్న. ఆ పోవడం పోవడం అసిఫాబాదు చేరికాని ఆగలేదు ! !

ఆ తర్వాత మళ్లీ వెలగటూరు ముఖం చూడలేదు జన్మలో -కొన్నాళ్లయిన తర్వాత జానకమ్మనుండి కబురేదయినా వస్తుందేమోనని ఎదురుచూచాడు. కాని ఎట్టిపిలుపూ రాకపోయేసరికి ఆ విషయం క్రమంగా మరచిపోయాడు లచ్చన్న. ఇంతలో లక్సెట్టిపేటలో తనకు పని దొరికేసరికి అసిఫాబాదునుండి పేటకు

మకాం మార్చాడు. కొన్ని నెలల తర్వాత తిరిగి ఆసిఫాబాదు వెళ్లేసరికి కొన్ని సంగతులు తెలిశాయి - వెలగటూరు నుంచి జానికమ్మ అనేవ్యక్తి పోయిందని తనకోసం కబురు వచ్చినట్లు. తాను లక్సెట్టిపేటలో వుంటున్నట్లు ఊళ్లో ఎవరికీ తెలియకపోవడంవల్ల సరైన అడ్రసు ఇవ్వనట్లు తెలిసింది. వెలగటూరు వెళ్దామా వద్దా అని ఆలోచించాడు లక్ష్మన్న. వెళ్లిమాత్రం తానిప్పుడు సాధించేదేముంది ?? అని మళ్లా పునరాలోచించి ధర్మన్న తండ్రి యాదగిరికి ఓ ఉత్తరం వ్రాశాడు - దానికి వెంటనే సమాధానం వచ్చింది. జానకమ్మ చివరి దశలో కాంతమ్మగారి కుటుంబంతో సంబంధం పెట్టుకున్నదనీ, జానకమ్మ ఇవ్వవలసిన బాకీకిగాను కాంతమ్మగారు ఆమె అనంతరం ఇంటిని స్వాధీనపరచుకున్నారనీ, ప్రస్తుతం కాంతమ్మగారు ఆ యింటిని బాగుచేసుకుంటున్నారనీ, వ్రాశాడు. జానకమ్మ ఆఖరిదశలో కూడా జామిచెట్టుపై వ్యామోహం వదలలేక పోయిందనీ, మాట పడిపోయేదశలో నీకు బంధువులెవరైనా వున్నారా ? ఏమైనా చెప్పాలా ? అని ప్రశ్నిస్తే తమ మతగురువైన రామానుజులవలె రెండు వేళ్లతో నేలనూ నింగినీ చూపించి మరీ పడిపోయిందనీ, ఇందలి వేదాంతార్థం గూర్చి ధర్మపురిలో విద్వాంసులను నిర్ణయించవలసిందిగా వెలగటూరు వాసులు కోరారని, ధర్మయ్య తండ్రి యాదగిరి ఆ వుత్తరంలో పేర్కొన్నాడు.

లక్ష్మన్న చాలా సేపు విచారించాడు. అయితే ఆస్తి దత్తస్వీకారమూ రెండూ లేకుండా తానా మెకు కర్మచేసి ప్రయోజనమేమిటని లక్ష్మన్న ఇక వెలగటూరు గూర్చి ఆలోచించడం ఆ తర్వాత మాని వేశాడు. కాని అతనికి జానకమ్మ చూపించిన చిన్ముద్రమాత్రం మనస్సులో అప్పుడప్పుడూ మెదులుతూనేవుంది.

ఇలా వుండగా కొంతకాలం తర్వాత ఒకరోజొక విచిత్రం జరిగింది. లచ్చన్న పనిచేస్తున్నచోట ఒకాయన పత్రిక చదువుతూ 'విన్నావా ఈ విడ్డూరం లచ్చన్నా' అన్నాడు. 'యేమేమిటని' లచ్చన్న ప్రశ్నించగా ఆ ఆసామీ ఇలా చెప్పాడు "వెలగటూరులో కరంటువేస్తూ స్తంభాలకడ్డం వస్తున్నదని కాంతమ్మగారనే వాళ్లయింటి జామకొమ్మలను కొట్టివేశారట. పట్టిమోడుండి ఏం ప్రయోజనమని కట్టెలకోసం వ్రేళ్లనుండీ త్రవ్వించగా, భూమిలో కుండనిండా ధగధగ మెరిసే బంగారునాణాలు దొరికాయట. నలుగురూ చూచారుకాబట్టి దాచే వీలు లేకపోయింది. భూగర్భంలోని ధనం కాబట్టి ప్రభుత్వం స్వాధీనం చేసుకొని దాని కాల నిర్ణయానికై పరిశోధనాశాఖవారికి హైదరాబాదు పంపారట" అని చెప్పగా కలకత్తా జామపండులా తెల్లబోయిన ముఖంతో నోట మాటరాక, శూన్యంలోకి చూస్తూ వుండిపోయాడు లచ్చన్న!



కొడవటిగంటి
కుటుంబరావు

ది గో-ఎహెడ్ పిక్చర్ కార్పొరేషనుకు ప్రొప్రయిటరు ముప్పైఏళ్ళవాడు. అదృష్టాని కతన్ని ఆదర్శంగా చెప్పుకుంటారు. అతను పదిహేను రూపాయల నౌకరీ చేసిన ఊళ్లో ఇప్పుడు నెలకు షుమారు 15 వేలు సంపాదిస్తున్నాడు. దాదాపు పది పన్నెండు లక్షల రూపాయలు అతనిపేర పెట్టుబడి అయివుంది.

అతనికి తెలివితేటలేవీ లేవని కొందరన్నారు. తనకు ఏవిధమైన ప్రజ్ఞా లేదని అతనే చెప్పుకునేవాడు. అతనికి ఆత్మే లేదని మరికొందరు అన్నారు అదృష్టం తప్ప అతని కున్నదంటూ చెప్పుకోబడ్డదేమీలేదు.

అదృష్టం అనేదికూడా కొందరనుకునేటంత అర్థహీనమైనది కాదు. అతని ప్రతి నిర్ణయమూ ఆలోచించిచూస్తే తెలివిగా కనిపించేది ఆ నిర్ణయానికి రావటానికి అతనా తెలివితేటలు బుద్ధిపూర్వకంగా ఉపయోగించేవాడా అనేది వేరే విషయం. అతను ముట్టుకున్నదల్లా బంగారమయేది. కాని అతను అన్నీ ముట్టుకునేవాడుకాడు. అతను ముట్టుకోనిది బంగారమల్లే కనిపించినా మట్టి అయేది. అతనికి తెలివితేటలు లేవనేది జగద్విఖ్యాతమైనప్పటికీ, తెలివిగలవాళ్ళనిపించుకున్నవారు అతని కన్న ఎక్కువ తెలివితేటలు కనబరిచిందెన్నడూలేదు. వాళ్ళుచేసే పొరపాట్లు అసలతను చేసేవాడేకాదు ఎంతో ప్రజ్ఞావంతు లనిపించుకునే వ్యాపారస్తులు అతన్ని గుడ్డిగా అనుకరించి ఒక్కొక్కప్పుడు దెబ్బతినేవాళ్ళు.

అతను సినిమా లైనులోకి ఎందుకు వచ్చాడో ఎవరూ ఊహించలేకపోయినారు ఈ నాటికీ అతనికి సినిమా తాలూకు తలాతోకా తెలియదు అతనికి సంగీతం వినటంలోగాని, అభినయం గ్రహించటంలోగాని ఏమీ అభిరుచిలేదు.